# లేడీ చాటర్లీస్ లవర్

ఎం. హెచ్. కేశవరావ్.

'చదివారా మీరు?' అడిగాడు సుబ్రహ్మణ్యం.

'చదివాం' అన్నారు ముగ్గురూ వీరులమల్లే, ఆలోచనల్లోంచి త్రుళ్ళిపడి.

'అవును — అంతా చదివేవుంటారు — బాన్ చేయడంకూడా అందుకేలెండి. షేక్స్పియర్‌ది ఒక్క నాటకంకూడా పూర్తిగా చదివే ఓపికలేని నేను, తంటాలుపడి బాన్ వున్న పుస్తకాలన్నీ సంపాదించి చదివాను'.

ప్రస్తుతం మేం మాట్లాడుతున్న విషయానికి, లేడీ చాటర్లీస్ లవర్ పుస్తకానికి వున్న సంబంధ మేమిటో నాకు అంతుపట్టలేదు. అదే వాళ్ళ ముఖాల్లోకూడా కనబడింది. — అసలు సుబ్రహ్మణ్యమే ఓపట్టాన అర్థంకాని మనిషి అని వూరుకున్నాను.

హాల్లో బిలియర్డ్సు ఆటగాళ్ళ కేరింతలు వుండుండి వినబడుతున్నయ్. క్లబ్బు మేడమీద మూల టేబుల్‌చుట్టూ కుర్చీల్లో ఆసీనులమైన మమ్మ ల్నెవరూ డిస్టర్బు చేయడానికి ప్రయత్నించలేదు. సుబ్రహ్మణ్యం వెయిటర్‌ని పిలిచి అయిదు కాఫీలకి ఆర్డరిచ్చి సిగరెట్టు పొగలో కాసేపు కలిసిపోయాడు.

అతనేం చెప్పబోతాడా అని చీట్లపేకకూడా మానుకుని వచ్చిన నరసింహారావు, మధుసూదనం, సీతారామయ్య అటెన్షన్ పోజులో సిగరెట్లు తగలేస్తున్నారు.

ఎత్తుగా పెరిగిన పొగడచెట్టు క్రింద కూర్చున్న మాకు ప్రత్యేకంగా సాయంత్రం ఎంతో అందంగా, హాయిగా వుంది. వర్షం వచ్చే సూచనలు లేవుగాని, గాలిలో వున్న తడి మా ముఖాలకి తగుల్తూ ఆ అందమైన సాయంత్రానికి చక్కిలిగింతలు పెడుతోంది.

అజ్ఞానంతో రాళ్ళకేసి తలలు బాదుకొని ముక్కలవుతున్న హుసేన్‌సాగర్ కెరటాలు మా మౌనంలోకి ఏవో మూగ సందేశాలు పంపిస్తున్నాయి. అలా డబ్బుని, మనుషుల్ని, విలువల్ని, చదువుల్ని, అన్నీ మరిచి, ఆలోచన్లని కట్టేసి, హుసేన్‌సాగర్ పైన చెట్లలో పరుగెత్తే రైలు పొగని దాటి, పడమటి కొండలమీద ఎగిరే పక్షుల్ని, వాటి రెక్కల్ని కాల్చేస్తున్న ఎరుపు సూర్యుడ్ని చూస్తూ కూర్చోవడం ఓ అవధిలేని అనుభవం.

కాఫీలొచ్చాయి.

మళ్ళీ అంతా కాఫీ చప్పరిస్తూ పడమటి దిక్కుకి చూపులు తిప్పారు. ఈ జీవితంలో అల్పమైన అనుభవా లెన్నో వున్నాయి. అవే ఒక్కోసారి మన జీవితాల్ని పాలిస్తాయనిపిస్తుంది. ఆ అనుభవాలకి అవధుల్లేవు. ఒకసారి — జీవితాంతం మరచిపోలేని తృప్తిగల క్షణాల్తో నింపేస్తాయ్. మరోసారి దాట లేని విషాదపు లోయల్లోకి విసిరేస్తాయ్. ఇష్టమైన వాళ్ళతో ఎదురుగా కూర్చొని కాఫీ త్రాగుతూ కబుర్లలో మునిగిపోవడం అందులో ఒకటి. ఎదురుచూపుతో, కలయికతో గడిపిన కొంతకాలం తరువాత వాళ్ళను రైలెక్కించి, రైలు కదులుతున్నప్పుడు కనురెప్పలక్రింద కనబడక నిలుచునే కన్నీటి చుక్కని భరించే క్షణాల అనుభవం మరోటి. సుబ్రహ్మణ్యంతో మద్రాసులో పరిచయం అలాంటి అనుభవాల్లో ఒకటిగా చెప్పొచ్చు. రెండు సంవత్సరాల క్రితం మావాళ్ళ పోరు పడలేక ఓ సంబంధం చూడడానికి వెళ్ళాను. అతనక్కడ స్పెన్సర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. హోటల్లో పరిచయమైంది. ఆ కాస్సేపటి మాటే టేబుల్ సంభాషణలో మేం ఆప్తమిత్రుల మైపోయా మనిపించింది.

ఆ ఒకరాత్రేగాక, యింకోరాత్రికూడా అతని బలవంతంమీద నే నక్కడే వుండడం జరిగింది. ఆ రాత్రి హిచ్‌కాక్ పిక్చర్‌కి వెళ్ళినట్లు గుర్తు.

రెండోరాత్రి అడయార్ బీచ్‌లో ఎంకి పాటల్తో బ్రతికాం.

రాజ్యలక్ష్మి బాగుండలేదని నేను మావాళ్ళతో చెప్పలేకపోయినప్పటికి, యిప్పుడప్పుడే పెళ్ళి చేసుకోకూడదనే నా అభిప్రాయాన్ని ఆ అమ్మాయి అందం మార్చలేకపోయింది. ఆతరువాత మద్రాసు వెళ్ళడానికి ఎందుకో నాకు యిష్టం వుండేదికాదు. సుబ్రహ్మణ్యంతో స్నేహం అక్కడితో తెగి పోవడానికి ఎక్కువ అవకాశా లున్నప్పటికి, అందుకు మాలో ఏ ఒక్కరూ ప్రయత్నించలేను. సుబ్రహ్మణ్యం వాళ్ల బ్రాంచి ఆఫీసుకి యిన్స్పెక్షన్ నిమిత్తం శుక్రవారం వొచ్చాడు. మధ్యలో ఆదివారం — క్లబ్‌కి రమ్మంటే నాతో వచ్చాడు. అతని అలవాట్లకిమల్లే అతను చాలామందికి అర్థంకాని వ్యక్తి.

'జీవితం ప్రశ్నించడానిక్కాదు — అనుభవించడానికి. అందిన ప్రతిదీ అందుకో — యిదేమిటని అడక్కు —' అంటాడు సుబ్రహ్మణ్యం. నిజానికి అతని జీవితంకూడా అంతే. చాలా సరదా అయినవాడు. అతనితో ఓ క్షణం గడపడం ఓ అనుభవం. పుస్తకాల్నిగూర్చి, సినిమాల్నిగూర్చి అతను మాట్లాడ్డం నేనెప్పుడూ వినలేదు. కాని, అతను చదివినన్ని పుస్తకాలు, చూసినన్ని సినిమాలు ఎవరూ చదివివుండరు — చూసివుండరు. అందుకే నాకాశ్చర్యం, అతను లేడీచాటర్లీస్‌లవర్ పుస్తకంగూర్చి మాట్లాడుతూంటే, ఇట్టే పరిచయం చేసేసుకోవడం అతనిలో ప్రత్యేకాకర్షణ. క్రిందకెళ్ళి వొచ్చేసరికల్లా అతనిచుట్టూ నరసింహారావు, మధుసూదనం, సీతారామయ్య వున్నారు. వాళ్ళు మహా మచ్చిక అయిపోయినారు అతనికి. అతను చెప్పేది శ్రద్ధగా వింటున్నారు.

సీతారామయ్య మా ఆఫీసులోనే పనిచేస్తున్నాడు. నరసింహారావుకి వెనక తగలేసినా తగలబడనంత ఆస్థి వుంది. అతనికి ప్రపంచం క్లబ్బున్నూ, జీవితం సిగరెట్‌కేసూ. అప్పుడప్పుడు ఏవేవో ప్రశ్నలు బయలుదేరుతూ వుంటాయి. ఆ సిగరెట్ పొగల్లోంచి, ఎవర్నేనా సమాధానాలు అడుగు తూంటాడు. కాని, అతనికి సమాధానాల్లోకంటే ప్రశ్నల్లోనే ఎక్కువ శాంతి దొరుకుతుంది. మధుసూదనం యింకా విద్యార్థి. అతనికి ప్రపంచం, జీవితం అంతా యూనివర్సిటీ, పుస్తకాలున్నూ.

నేను పైకొచ్చేప్పటికి అతనేదో సలహా అడుగుతున్నాడు సుబ్రహ్మణ్యాన్ని. అతనెవరో కాలేజీ అమ్మాయిని ప్రేమించాట్ట, త్వరలోనే రిజిష్టర్ మారేజ్ చేసుకోబోతున్నారట. ఆతరువాత అతను ప్రేమనుగూర్చి చాలా సేపు

మాట్లాడాడు. పెళ్ళయినాక తాము ఆగ్రా వెళ్లి తాజ్‌మహల్ చూడా లనుకుంటున్నామన్నాడు. చివరిగా 'ప్రేమ గొప్పవస్తువు. అది మనిషిని దేవత్వాని కెత్తుతుంది, దానిని పారేసుకున్న మనిషి బ్రతకడం అనవసరం' అన్నాడు కళ్లు సగంమూసి ఆకాశంకేసి చూస్తూ.

'ఆమె అందంగా వుంటుంది, ఆ అందం మీకు కావాలి, పెళ్ళిచేసుకుంటున్నారు. అలా చెప్పండి మధ్య ప్రేమ గురించి ఎందుకు' అన్నాడు సుబ్రహ్మణ్యం. అతనికి ప్రేమ అంటే కసి. అటువంటి వస్తువూ, పదం లేదన్నాడు. అది ఎలా భాషలోకి వొచ్చిందో అర్థంకావడం లేదన్నాడు. అదో మనోదౌర్బల్యం అన్నాడు. చివరిగా మనిషి నాగరికతపేరిట ప్రతి వెధవపనీ చేసి దానివెనక దాక్కుంటున్నా డన్నాడు.

మధుసూదనానికి ఉక్కురోషం వొచ్చింది. 'ప్రేమించుకున్న వాళ్లు లేరంటారా; ప్రేమకు విలువే లేదంటారా?' అన్నాడు.

'దాన్ని ప్రేమ అనకండి, 'యిష్టం' అనండి — అది లైకింగ్. అందులో కూడ డిగ్రీలున్నాయి. అట్లా అనండి. నాకు గులాబీ అంటే యిష్టం, పొయిట్రీ అంటే యిష్టం, భానుమతి పాట యిష్టం — మనిషి యింక ఊగిపోకుండా వుండలేనంత లెవెల్స్‌లో. అందుచేత నేను అవన్నీ ఒకసారికూడ కావాలనుకుంటాను. అయితే నా యీ అభిరుచులన్నీ ఎప్పుడైనా మారొచ్చు. అందువల్లనే లైక్‌చేస్తున్నాను అనమంటాను. ప్రేమిస్తున్నా ననకండి. ప్రేమకు శాశ్వతత్వం వుంది. అది మనకి లేదు.'

'శాశ్వతంగా ప్రేమలో బ్రతికినవాళ్లు, జీవితాంతం వాళ్లే కావాలనుకుని మని అయినపోయినవాళ్లు, పెళ్ళి ఆయినా చివరిదాకా ఒకరిలో ఒకరు లీనం అయిపోయినవాళ్లు లేరంటారా?' అన్నాడు నరసింహారావు.

'లేరు, వుండరు. వుండకూడదు — లైలామజ్నూ కథ యిప్పుడు చెప్పకండి' అన్నాడు సుబ్రహ్మణ్యం.

'ప్రేమని యింద్రియాల చాపల్యానికి అంటగట్టి మీరు ఆలోచిస్తున్నారు — అంతకంటే ఎందుకు పైకి ఊహించరు?' అన్నాడు సీతారామయ్య.

'నిజంగా ప్రేమించి, పెళ్ళిచేసుకున్నవాళ్ళ ఆ తరువాత జీవితాలు నాకు తెలుసు కాబట్టి' — అని కాసేపాగి, మీరు 'లేడీ చాటర్లీస్ లవర్' నవల చదివారా?' అన్నాడు.

"చదివాం" అన్నారు ముగ్గురూ, మధుసూదనంతోసహా, ఆలోచనల్లోంచి త్రుళ్ళిపడి.

కాఫీ లయిపోవడంతో అంతా తిరిగి ఎవళ్ళచుట్టూవాళ్ళు, సిగరెట్టు పొగల్తో గూళ్లు కట్టుకుంటున్నారు.

దూరంగా పడమటి కొండలమీద ఒకరోజు కాలిపోగా మిగిలిన బూడిద చీకటిగా మారుతోంది. సంధ్యలో చిక్కుకున్న "కాలం" కదల్లేక ఉక్కిరిబిక్కిరవుతోంది.

సుబ్రహ్మణ్యం ప్రారంభించాడు.

"అప్పుడు నేను బి. ఎ. ఫైనలియర్ చదువుతున్నాను. అప్పుడే అయింది వాళ్ళిద్దరితో పరిచయం. కాలేజీలో కథలల్లే చేప్పుకునేవారు వాళ్ళిద్దర్ని గురించీ. గోడలమీద రంగులతో, కార్టూన్లతో వార్తలు — సైకిళ్లమీదపోతూ వాళ్ళిద్దర్నిచూసి లైలా, మజ్నూ; రోమియో, జూలియట్ అని అరవడం, వెకిలినవ్వులు — యీ తేలిక విషయాలేమీ వాళ్ళకి తెలీవు, పట్టవు.

వెన్నెల రాత్రుళ్లు బీచిలో ఒడ్డున పడవ నానుకుని, ఇసకలోంచి చేతుల్ని కలుపుకుని, ఒకళ్ళ కళ్ళలోకి ఒకళ్ళు గంటల తరబడి చూసుకుంటూ కూర్చోడం నేను చూశాను. వర్షంలో గొడుగు తెరవడం మరచిపోయి, మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ, చిన్నపిల్లలు వొదలిన పడవల్లా వీధులవెంట నడిచి పోతూండడం చూశాను నేను. వెలవురోజుల్లో థియొసాఫికల్ సొసైటీ ఆవరణలో వాళ్ళిద్దరూ ఆకాశం వెలుగుని కళ్ళలోకి తెచ్చుకుని గడ్డిమీదే మొలిచినట్లు పడి, ఊగి, ఆడి ఆడి, అలిసి గడ్డిపూలైపోవడం తెలుసు నాకు.

అతని పూర్తి పేరు ఏమిటో — శ్యామూ అని పిలిచేవారంతా. ఆమె పేరు కరుణా బెనర్జీ. మద్రాసులో వాళ్ళ బాబాయి పెద్ద ఉద్యోగట; అత నింట్లో వుండి చదువుకుంటోంది.

హాస్టల్లో రాత్రి ఏ క్షణంలో చూసినా అతని గదిలో లైటు వెలుగుతూ వుండేది. క్లాసు పుస్తకాలే కాదు, కొత్తగా వొచ్చే సాహిత్యమంతా తెగచదివే వాడు. అమాయికమైన ముఖంతో అతను నిజంగా అందంగా వుండేవాడు. ఎరుపుతో కందిపోయే శరీరం ఆమెది. అతని అల్లరిజుట్టు, మండే ఆమె చేతివేళ్ల కొసలకి స్నేహం. కొన్ని అనుభవాలకి రంగురెక్కల ఆకర్షణ వుంటుందనుకుంటాను. ఒకచోట నిలవక, తనవెంట తిప్పుకునే ఆమె చూపులతో ఆడుకోవడం అలాంటి అనుభవం అతనికి.

కాలేజీలో ఎప్పుడూ మాట్లాడుతున్నట్లే కనిపించేవాళ్లే కాదు. మరి ఎట్లా తెలియబరచుకునేవారో — ఎక్కడో హఠాత్తుగా, ఊహించనిచోట కనబడే వాళ్ళు — థియేటర్‌లోనో, బస్సులోనో, రోడ్డుప్రక్క లైట్లకింద నవ్వు పంచుకుంటూనో. అదీ వాళ్ళ ప్రేమ. ఒకళ్లు లేకపోతే మరొకళ్ళకి బ్రతుకు అనవసర మనుకునే ప్రేమ.

శివపార్వతి నృత్యం, వెలుగు చీకట్లకు జీవితాన్నిచ్చే రాత్రింబగళ్లు. గొప్ప అందమైన అడివిపువ్వు చుట్టూ పేరుకునే సువాసన, వెన్నెల్లో రాళ్ళను తడుపుతూ ప్రవహించే సెలయేళ్లు గుర్తొస్తున్నాయి నాకు వాళ్ళిద్దర్ని చూస్తే. జన్మలకి అతీతమై సృష్టి రహస్యాన్ని తెలుసుకోడానికి బయలుదేరిన యోగులా అనిపించేది.

అప్పుడప్పుడు అతని వద్దనుండి నేను పుస్తకాలు తీసుకుంటూ వుండే వాడిని. వాటినిగూర్చి గంటలతరబడి చర్చించే వాళ్ళం. అట్లా పెరిగింది మా స్నేహం.

పరీక్ష లైపోయినై.

ఇంక అందరూ విడిపోక తప్పదు. ఇంక తలొకరూ జీవితానికి పట్టాలు వేసుకునే ప్రయత్నం చేయాలి. కరుణని బండెక్కించడానికి అతనితోబాటు నేనూ స్టేషను కెళ్లాను. ఆ దృశ్యం నే నిప్పటికీ మరచిపోలేదు. అతని కళ్ళ వెంట కన్నీళ్లు — "ఒచ్చేస్తాగా" అని ఆమె ఓదార్పు, తనుకూడా అతని చేతితో కళ్ళను తుడుచుకుంటూ. సెలవలకు యింటికెళ్ళినప్పుడు అక్కడ తమ పెళ్ళిగూర్చి పెద్దవాళ్ళ అభిప్రాయాలు కనుక్కోవా లనుకున్నారు. ఉత్తరాలు వెంటనే వ్రాసుకుందాం అనుకున్నారు. ఒకరికొకరు ఓదార్పు అయినారు. రైలు జ్ఞాపకాల్ని మోసుకుని, సిగ్నల్ వెనక చూపుల్ని త్రుంచేసి, కసిగా రాత్రిని చీల్చుకుంటూ ముందుకు వెళ్ళిపోయింది.

నేను యింకా చదువు కొనసాగించే స్థితిలో లేను. మా వాళ్ళకి ఉత్తరం వ్రాసి, అక్కడే వుండి ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుంటూ కూర్చున్నా. పెద్ద ప్రయత్నంమీద స్పెన్సర్ కంపెనీలో ఉద్యోగం దొరికింది.

రిజల్ట్సు వొచ్చాయి.

గండం గడిచింది. నేను ప్యాసయినాను. శ్యాము, కరుణలకు క్లాసు వొచ్చింది. కాలేజీ యింకో వారం రోజుల్లో తెరుస్తారనగానే యిద్దరూ మద్రాసు చేరుకున్నారు. కాని, దిగులు ముఖాల్తో, వేసవి ఎండకి వాడిలిపోయినట్టు కనబడ్డారు; వాడు బస్సులో కనబడగానే ఆ దగ్గరి స్టాప్‌లో దిగి, కాఫీ హౌస్‌లోకి లాక్కెళ్ళి కారణం అడిగాను. ఇంట్లో తమ పెళ్ళికి ఎవరూ ఒప్పుకోలేదట. "వాళ్ళ కీ విషయాలు అర్థం కావురా" అని బాధపడ్డాడు.

"మరేం నిశ్చయించుకున్నారు ?" అనడిగాను. "ఇంకా ఎం. ఏ. ఎలాగూ చెయ్యాలి గదా – మే మిద్దరం స్వతంత్రులు మయ్యేంతవరకు చేసుకోదలచుకో లేదు" – అన్నాడు. అంటే – ఒకరికోసం ఒకరు వేచివుండడ మన్నమాట!

ఆ తరువాత ఆఫీసు పనితోను, క్యాంపులతోను, నేను వాళ్ళని తరచు కలుసుకోడానికి వీలుండేదికాదు. మా వాళ్ళకి యిప్పుడు నేను జవాబు చెప్ప లేని స్థితిలోపడ్డాను. చదువయిపోయింది; ఉద్యోగం దొరికింది గదా – యింక తప్పదు పెళ్ళిచేసుకు తీరాలన్నారు – అప్పటికి తమపని పూర్తి అయిపోతుందన్నట్టు. అసలు నేను చేసిన గొప్ప పనేమిటో వాళ్ళకి తెలీదు. అది – నేను కాలేజీలో ఎవర్నీ ప్రేమించకపోవడం, దరిమిలా వాళ్ళకి సమస్యలు సృష్టించకపోవడం. కాని, వాళ్ళు నా నిజాయితీని ఏ మాత్రం గమనించినట్టులేదు. తప్పదు – పెళ్ళి చేసుకుతీరాలి అన్నారు. అయితే నిజానికి నే నెవర్నీ ప్రేమించకపోవడం బహుశా నాకు తెలీకుండా ఆడ వాళ్లంటే నాకున్న భయం కావచ్చు. ఆడవాళ్ళు తెలివయిన వాళ్లు; కొంద రాడవాళ్లు మరీ తెలివయినవాళ్లు, అందుకే వాళ్ల తెలివితేటలకి నేను దూరంగా వుండడానికి ప్రయత్నించాను. పైగా ఆడవాళ్లంటే నాకు కొన్ని ప్రత్యేకాభి ప్రాయాలుండేవి. ఆడదాని గమ్యం మగాడు, మగాడి గమ్యం మాత్రం ఆడది కాదు. పెళ్ళితో ఒకళ్ళ సమస్య తీరి, మరొకళ్ళ సమస్య ప్రారంభ మవుతుంది.

నా పెళ్ళికి నే నెవర్నీ స్నేహితుల్ని పిలవలేదు. చాలా మామూలు అయిన యీ విషయాన్ని ఎందుకింత పట్టించుకుని చాటించుకుంటారో నా కర్థ మయ్యేదికాదు. అయితే పెళ్ళి జీవితంలో ఒక చైతన్యపూరితమైన మలుపు.

ఆవిడగారి అభిరుచులు, అభిప్రాయాలు, కొత్త జీవితానికి కావలసిన హంగులు సమకూర్చుకుని ఆవిడ్ని రెండోసారి పురిటికి పంపేప్పటికి నా వైవాహిక జీవితం మూడో యేడులో పడింది. ఆవిడ తమ్ముడితో వెడుతూ, నేను ఆవిడలేని సమయంలో చేయగూడని పను లేవో చెప్పి, నేను మర్చి పోయిన వాటిని గుర్తుచేసి పోయింది. సిగరెట్లు, పుస్తకాలు, సినిమాలు, హోటల్ మెతుకులతో కాలం గడిచిపోతోంది. ఓ వారం "ఇలస్ట్రెటెడ్ వీక్లీ"లో "లేడీ చాటర్లీస్ లవర్" నవలపై ఓ వ్యాసం చదివాను. ఇంత గొడవ చేసిన ఆ పుస్తకం ఏమిటో చదవాలని వెంటనే మార్కెట్‌కు బయలుదేరాను. రెండురోజుల క్రిందటే ఆఖరి కాపీ అమ్ముడుపోయింది, ఆర్డరిస్తే తెప్పిస్తానన్నాడు పుస్తకాల షాపు కుర్రాడు. ఈ లోపల నేను సంపాదించలేనా – అని వద్దన్నాను. కాని, ఆ నెలలో దానిపై మరో రెండు వ్యాసాలు దొరికాయి తప్ప అసలు పుస్తకం దొరకలేదు. ప్రపంచంలో ఏదీ ఏడిపించిగాని దొరకదు అనిపించింది. అంతటితో దాని కోసం అన్వేషణ మానేసి, దొరికినప్పుడే చదవాలని ఒట్టేసుకున్నాను. కాని, నా నిశ్చయాలపై నాకేమాత్రం నిశ్చయం వుండదని యింతకుముందే మా ఆవిడ ఋజువుచేసి మరీ వెళ్ళిపోయింది. ఆడదాని బలహీనతలు మగాడికి తెలీవు – నిజానికి ఏవీ తెలీవు – కాని, అన్నీ తెలుసు ననుకుంటాడు. మగాడి బలహీనత మాత్రం ఆడదానికి బాగా తెలుసు.

ఓ ఆదివారం ఏదో యింగ్లీషు పిక్చర్‌కి మ్యాట్నీకి వెడితే, థియేటర్‌లో కనబడ్డాడు శ్యాము. వాడ్ని చదవాలని ప్రయత్నించానుగాని, వాడు నాకు అవకాశం యివ్వలేదు. సాయంత్రం తిన్నగా యింటికి లాక్కెళ్ళాడు. ఒక్కడే వుంటున్నాడు. కాఫీ తయారుచేశాడు. దొడ్లో పూలమొక్కల మధ్య తిరిగి ఆనందంగా ఆ సాయంత్రాన్ని గడిపాం. నేను అడక్కుండానే అన్ని విషయాలు చెప్పాడు. కరుణ, వాడు, లెక్చరర్సుగా పనిచేస్తున్నట్టు, మార్చిలో పెళ్ళి చేసుకోబోతున్నట్లు చెప్పాడు. వాడి కళ్ళలో మార్చికోసం ఎంతో ఎదురుచూపు వుంది. అది ఎంతో సహజమైనా, వాళ్లు నాకు మనుషుల్లా కనబడలేదు. ఒకరికోసం ఒకరు కాలాన్నికూడా ఆపేశారు. సౌందర్యాన్ని తరిగిపోకుండా చేసుకున్నారు. అనుభవాల్ని పంచుకోడానికి తహతహని హద్దులో వుంచారు. ఆ రోజుకు అస్తమిస్తున్న సూర్యుడ్నిచూసి, అప్పుడే ఓ రోజు కాలిపోయిందే అని బాధపడే నాబోటి వాడికి – విలువ కట్టలేని, జారిపోయే కాల ప్రవాహాన్ని బాధించిన వాళ్ళ శక్తికి జీవితంలో భయపెట్టే చీకటి కోణాలంటే భయం పోయింది.

నా సంగతి విని, చిన్నగా నవ్వి, ''ఇప్పుడు యింటికిపోయి చేయవలసిన రాచకార్యా లేమున్నాయ్'' అని ఆ రాత్రి నన్నక్కడే వుంచేశాడు. భోజనా లైన తరువాత, బెడ్‌మీదకు వెడుతూ ఓ పుస్తకం తీసుకుందామని షెల్ఫు వద్దకు వెళ్ళాను. నా కొరకే ఎదురు చూస్తున్నట్లు షెల్ఫు మధ్యలో వుంది, నవ్వుతూ, 'లేడీ చాటర్లీస్ లవర్' నవల.

"ఎలా వుందిరా, నీకీ నవల ?'' అనడిగాను పక్క సర్దుకుంటున్న శ్యాముని. "నా పుస్తకాల పిచ్చి నీకు తెలుసుగదా – కాని, అదేం ఖర్మమో యీ పుస్తకం కొని రెండేళ్ళయింది. యింత వరకూ దాసిని చదపడం పడలేదు – కొన్న ఓ నెలరోజుల వరకు కాలేజీపనితో సరిపోయింది. ఆ తరువాత ఓ యిరవై మంది చేతులుదాటి మొన్ననే చేరింది'' అన్నాడు.

"అయితే నన్ను యిరవై వొకటో వాడిని కానివ్వు" అని లాక్కున్నా.

ఆ తరువాత రెండు రాత్రులూ ఆ పుస్తకం చదవడంలో గడిచిపోయినై. చెప్పేది ఏ విషయమైనా కానివ్వండి – ఆ చెప్పే విషయంపై రచయిత సిన్సియారిటీ నాకు బలంగా నచ్చింది. లారెన్సు చాలా లోతైన మనిషి అనిపించింది నాకు. మా కంపెనీలో నా దగ్గర లాక్కుని ఓ డజను మంది చదివారు. ఆ తరువాత, అట్టలూడే స్థితిలో నెమ్మదిగా చేరిందా పుస్తకం శ్యామూకి.

శ్యామూ కరుణల పెళ్ళికి నేను హాజరయినాను. ఆ రాత్రి ఆ దంపతులు చక్కని డిన్నరిచ్చారు. ఎంతో సరదాగా తిరిగి, పోయిన ఆనందం దొరికి నట్లు గడిచింది ఆ సాయంత్రం నవ్వుల్తో, చప్పట్లతో, పాటలతో. వధూ వరులవైపు బంధువు లెవరూ రాలేదు. అంతా స్నేహితులే. ఫొటోస్ తీయించుకోవడం అయిపోయింది సాయంత్రమే. డిన్నర్ అయిన తరువాత నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపి అంతా వెళ్ళిపోయినారు. నౌకర్లు కుర్చీలు, సామగ్రి అంతా సర్దుతున్నారు. ప్రెజెంటేషన్స్ చూపిస్తోంది కరుణ నాకు. ఆమె ఆ సమయంలో మరీ అందంగా కనబడుతోంది. దగ్గరగా చూస్తుంటే తెలుస్తోంది బెంగాలీ అయినా, ఆమెది ఈజిప్షియన్ సౌందర్యం అని. శ్యామూ అమెరికన్ సూట్‌లో ఆకర్షణీయంగా వున్నాడు. ఆమె ప్రెజెంటేషన్స్ చూపించడం అయిపోయింది – చివరిగా నా ప్రెజెం టేషన్ వద్దకొచ్చి కాసేపు ఆగిపోయింది – "అబ్బ, ఎంత సౌందర్యా రాధకులు" – అని నా వంకచూసి నవ్వింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌లో వీనస్ అది. "చాలా పొద్దుపోయింది, యింకా నే నిక్కడ వుండటం తప్పుగదూ !" అంటూ నేను యింటికి బయల్దేరాను. గేటు వేసుకుని వెన్నెల్లో ఒకళ్ళ చేతులు ఒకళ్ళు పట్టుకుని, కళ్ళల్లోకి చూసుకుంటూ వాళ్ళిద్దరూ లోపలికి వెడుతుండడం నేను చూడకుండా వుండలేక పోయినాను.

నేను రెండడుగులు వేసేప్పటికి, "టెలిగ్రాం, సార్" అంటూ పోస్ట్‌మన్ వొచ్చాడు. కరుణ, శ్యామూ, కేకవిని పరుగెత్తుకుంటూ బయటికొచ్చారు. జీవితం పాములాంటిది – ఏ మాత్రం ఆదమరచివున్నా కాటేస్తుంది అని పించింది నాకు. టెలిగ్రాం కరుణ అన్నగారు సతీశ్‌చంద్ర నుండి – తండ్రి పోయాడు, వెంటనే ప్లేనులో వొచ్చేయమని కరుణకు.

ఆ రాత్రి ఆమె నోదారుస్తూ నేనక్కడే వుండిపోయినాను. పెళ్ళయిన సంతోషం నీటిమీద వ్రాతలాగ చూస్తూండగా చెరిగిపోయింది.

తెల్లారి వెళ్ళిపోయింది.

కంపెనీ పనితో తీరిక లేక నేనొక వారంరోజులు తిరిగి శ్యామూను కలుసుకోవడం పడలేదు. మధ్యలో మాత్రం కరుణ వస్తే తెలియచేయమని వాడి కాలేజీకి ఫోనుచేసి చెప్పాను.

అవాళ సాయంత్రం నేను పని పూర్తిచేసుకొని యింటికి రాబోతుంటే "మీకు ఫోనుకాల్ వచ్చింది సార్" అని ప్యూను వచ్చి చెప్పాడు. రిసీవర్ తీసుకున్నాను. జనరల్ హాస్పిటల్ నుండి శ్యాము మోటర్‌సైకిల్ మీద పోతుంటే యాక్సిడెంట్ అయిందట — తెలివి వొచ్చినప్పుడు అడిగితే నాపేరు చెప్పాడట. ఆఫీసు వానులో హాస్పిటల్‌కు పరుగెత్తాను. చాలా బలహీనంగా ఉన్నాడు. రక్తం చాలా పోయిందట. వొళ్ళంతా కట్లు. కరుణకి టెలిగ్రాం యిస్తానన్నాను. "ఒద్దు — నువ్వున్నావుగా — ఉత్తరం వ్రాయి వొంట్లో బాగాలేదని" అన్నాడు నీరసంగా.

డాక్టర్ని కలుసుకున్నాను ఆదుర్దాగా. "ప్రమాదమేం లేదులేండి — దెబ్బలు బలంగా తగిలాయి — చిన్న ఆపరేషను అవసరమవుతుంది — కంగారు పడనక్కర్లేదులెండి" అన్నాడు. ఈ పరిస్థితిలో టెలిగ్రాం యిస్తే కరుణ మరీ బేజారయిపోతుందని వెంటనే రావలసిందిగా ఉత్తరం మాత్రం వ్రాశాను.

ఆపరేషను అయిపోయింది. క్రమంగా దెబ్బలుకూడా చాలావరకు మాని పోయాయి. డాక్టర్ ఏది చెబితే అది ఆ క్షణంలో అమరుస్తూ వాడితోనే హాస్పిటల్‌లో వుండిపోయాను సెలవుపెట్టి. రెండోవారంలో యింటికి తీసుకొచ్చేయడం కూడా జరిగింది. డాక్టర్ ఎక్కువ విశ్రాంతి కావాలన్నాడు. కోప్పడి, వాడి నేమీ చదువనిచ్చేవాడిని కాదు. కావలసినంత విశ్రాంతి, బలమైన ఆహారం, పళ్ళతో తిరిగి చాలా త్వరగా వాడు ఆరోగ్యం పుంజుకున్నాడు. ఇంతలో మా మామగారి నుండి ఉత్తరం వొచ్చింది, పసుపు చేర్తో అంటించబడి, వాళ్ళమ్మాయి కొడుకుని ప్రసవించిందట, తల్లీ బిడ్డా కులాసాగా వున్నారట. నన్ను వెంటనే రమ్మని వ్రాశారు. వంశో ద్ధారకుడ్ని చూడాలి. నాయర్‌కి యిన్‌స్ట్రక్షన్సు యిచ్చి, వెంటనే వొచ్చేస్తా నని శ్యాముతో చెప్పి ఆ రాత్రి బండికే బయలుదేరాను.

నే వెళ్లేప్పటికి యిల్లంతా సందడిగా వుంది. ఆవిడ మాత్రం ఓ గదిలో పడుకొనివుంది. ఇంట్లో నన్నంతా అతి గౌరవంగా చూసినట్లయింది. మంచం మీద వొంగి, ఆవిడ బుగ్గమీటితే వంశోద్ధారకుడు కదిలాడు. కళ్లు తెరిచి, నీరసంగా నవ్వి, సిగ్గుగా "ఎప్పు దొచ్చారు?" అంది. ఆమె ఆ నవ్వులో ఇదివరకటి చిలిపితనం లేదు, అసంపూర్ణత్వం వుంది. ఆ చిలిపితనం ఇంక నాకు దక్కదే అనే భయం నాలో మెరవకపోలేదు.

ఎంత త్వరగా తిరుగుముఖం పడదామన్నా వీలుగాకపోయింది. మామ గారు శాంతి చేయించాలన్నారు. ఆ తతంగం పూర్తయేప్పటికి పదిరోజు లయిపోయింది. సాధ్యమైనంత త్వరగా వాళ్ళమ్మాయిని పంపించమని నేను వొచ్చేశాను. మరో రెండ్రోజులు నే నెక్కడికీ ఆఫీసునుండి కదలడానికి వీలులేకపోయింది. శ్యామే ఆఫీసుకొచ్చి నన్ను కలుసుకున్నాడు. అతను మునుపటికంటే చాలా ఆరోగ్యంగా తయారయ్యాడు. నే వెళ్ళిన మూడో రోజునే కరుణ వొచ్చిందట.

ఆవాళరాత్రి వాళ్ళింటికెళ్లాను. బెడ్‌రూంలోంచి మాటలు వినబడుతున్నయ్ నాకు వినబడేటంత గట్టిగా. బెడ్‌రూంలోకి వెళ్ళడం దేనికని వరండాలోనే పేపర్ చూస్తూ కూచున్నాను. కరుణ పెట్టె సర్దుకుంటున్న చప్పుడు — మధ్య మధ్య దగ్గుత్తికతో అంటున్న మాటలు వినబడుతున్నయ్. చివరికి ఆయో మయంగా నిలబడి భయకంపిత గాత్రంతో ఇలా అన్నది—

'మనిద్దరం చీలిపోక తప్పదు.'

'అవును — చీలిపోక తప్పదు,' శ్యామ్ విచారంగా చేతులు నలుపుకుంటూ అన్నాడు.

ఆ తరువాత నేను విన్న మాటలవల్ల తెలిసిన సత్యం నగ్నమైంది, భయం కరమైంది. దాన్ని నేను నమ్మలేను, ఆ దృశ్యాన్ని నేను ఎదుర్కోలేను. నాకంత ధైర్యంలేదు. నేను పిరికివాణ్ణి. వాళ్లు నామాటకు రాకముందే రోడ్డు మీద కొచ్చిపడ్డాను. అప్పుడు నన్ను వేధించిన ప్రశ్న ఒక్కటే — కొంత మంది యెడల జీవితం ఎందుకింత క్రూరంగా వుంటుంది? అని.

ఆ సత్యం యిది: అతని ఆపరేషన్ సక్సెస్‌ఫుల్‌గానే జరిగింది. కాని, ప్రాణాన్ని రక్షించడానికి డాక్టర్ చేసిన ప్రయత్నంలో అతనింక స్త్రీకి పనికి రాకుండా అయిపోయినాడు. అతను కరుణకేకాదు — యింకెవరికీ అక్కర్లేదు....'

సుబ్రహ్మణ్యం సిగరెట్టు ట్రేలో వదిలేశాడు. అది కాస్త పొగ వదిలి బూడిదైపోయింది. పొగడపూలు గాలికి తెగి మామీద పడుతున్నయ్. మా మధ్య గాలి క్రమంగా బరువైంది.

ఆ తర్వాత అన్నాడు నరసింహారావు నిశ్శబ్దాన్ని చీలుస్తూ.

'కరుణ వెళ్ళిపోయింది. ఆ తరువాత నాకు అతను కనిపించలేదు. మరో వూరు, మరో ఉద్యోగం, మరో రకమైన జీవితం,....గతాన్ని మరచిపోవ దానికి ప్రయత్నం — ఆడదాని గమ్యం మగాడు, మగాడి గమ్యం మాత్రం ఆడది కాదు — అందుకే అనుకుంటాను అతనింకా బ్రతికివుండి' — అని నిట్టూర్పు విడిచి, 'ఇప్పుడు చెప్పండి ప్రేమ అంటే ఏమిటి? వాళ్ళు ప్రేమించుకోలేదనగలరా...' అన్నాడు సుబ్రహ్మణ్యం అందరివంక తిరిగి.

ఎవరూ ఏం మాట్లాడలేదు.

చీకటిపడింది.

హుసేన్‌సాగర్ నీటిమీద సంధ్య విరజిమ్మిన రంగుల్ని చూస్తూ కూర్చున్నాం. సీతారామయ్య ఏదో అనబోతుండగా, కిందనుండి యిద్దరొచ్చి ఆటలో చేతులు తక్కువైనయ్యని నరసింహారావుని, మధుసూదనాన్ని తన్నుకుపోయారు.

'నీతో చాలా మాట్లాడాలిరా' అన్నాను సుబ్రహ్మణ్యం వంక తిరిగి.

'అవును నాకూ చాలా మాట్లాడాలనివుంది. నేనోసారి మా బాస్‌కి కనబడి, వెంటనే నీరూం కొచ్చేస్తాను. లేకపోతే ఆయన కంగారుపడతాడు. వెంటనే వచ్చేస్తానులే రూంలోనే వుండు — అంటూ సుబ్రహ్మణ్యం వెళ్ళిపోయాడు. సీతారామయ్య క్రిందికి దిగి బిలియర్డ్సు చూడడంలో మునిగిపోయినాడు.

సంధ్య చీకట్లో నేనొక్కణ్ణీ ఒంటరితనంలో చిక్కుకున్నాను. ఒంటరి తనం మన్ని కసిపెట్టి భయపెడుతుంది. సిగరెట్టు వెలిగించాను — ఒంటరి తనం కాలిపోయింది. సిగరెట్టు క్షణాల్ని కాల్చి ట్రేనిండా బూడిద నింపు తోంది. యాష్‌ట్రే నవీన జీవితానికి ప్రతిబింబమా?'

నెమ్మది నెమ్మదిగా నగరాన్ని చీకటి కౌగిలించుకుంటోంది. ఆకాశం కాటుక పెట్టుకుంది. అప్పుడప్పుడు ఓ చుక్క మేఘాల వెనకనుండి కన్ను గీటి తిరిగి — 'తప్పు' అన్నట్లు పరదా పైకి లాక్కుంటోంది. ఆలోచనలో తలమీద చినుకు పడ్డట్లయింది — తడిమితే పొగడపువ్వు దొరికింది. ఎందుకో తెలీదు ఉషారాణి గుర్తొచ్చింది. వానజల్లులో వొణికే పూలు, సముద్రపు గాలిని అనుభవించే సాయంత్రాలు ఉషారాణిని గుర్తు తెస్తాయి. సుందర్‌కి అన్యాయం చేస్తున్నానని నా మనసు చిత్రవధ అయిపోతున్న నా రాత్రుల



నిండా ఆమె ఆలోచనలే గుమికూడతాయి. కోర్కెలతో ఎరుపెక్కి, యింద్రియాల్ని వెక్కిరించే ఆమె పెదాలు, వాటి వెనక నెలవంక ఆహ్వానపు చిరునవ్వు, ఆ స్నేహపు మాటలు నన్ను వెన్నంటి తరుముతున్నాయ్.

నడుస్తూ బయలుదేరాను

రిక్షాఎక్కో, బస్సెక్కో నగరం వేగంలో కలిసిపోయి, యీ సాయంత్రపు అనుభవాన్ని వేగంలో పారేసుకోదలచుకోలేదు నేను. నగరపు కీచుగొంతులో యీ సాయంత్రపు సంగీతాన్ని కలిపేయదలచుకోలేదు.

లైట్లు వెలిగినై.

నగరం, చీకట్లో తమాషాగా కనబడుతోంది. ఓ విధంగా నగరం భోగం దానిలా తయారైంది. విటుల్ని ఎంటర్‌టెయిన్ చేయడానికి ప్రయత్నిస్తోంది. నగరం పగటివేషాన్ని విప్పేసింది. నగరం - రాత్రికి తెలిసినన్ని రహస్యాలు నగరం - పగలుకు తెలియవు.

ఇలాగే ఓ సాయంత్రం క్లబ్బునుండి నడుస్తూపోతూవుంటే వర్షం ప్రారంభమైంది. కాస్తయితే పూర్తిగా తడిసిపోయేవాడే — దారిలో ఉషారాణి యిల్లొచ్చింది. అల్లుకుంటూ కిటికీ పక్కన కూర్చున్న ఉషారాణి రోడ్డుమీద పోతున్న తనని పిలిచి — 'మా యింట్లోకి రావడం తప్పా' అని కోపం తెచ్చుకుంది. లోపలికెళ్ళి వేడి వేడి కాఫీ తీసుకొచ్చింది.

'ఒకే చెంచా వేశాను, యింకాస్త పంచదార వేసుకోండి' అంది నిశ్శబ్దంగా నవ్వుతూ.

'కాఫీ నాకు చేదుగానే వుండాలి' అన్నాను నేను.

'పంచదార వుండగా చేదు భరించడం దేనికి – లేకపోతే ఎలాగూ తప్పదుగదా' అంటూ బలవంతంగా యింకాస్త పంచదార కలిపింది.

ఆ తరువాత ఎన్నో సంగతులు మాట్లాడింది ఉషారాణి, క్షణాల్ని నవ్వుల్తో నింపేసి.

మరో రోజు థియేటర్‌వద్ద చెలికత్తెలతో కనిపించి, తానే టికెట్టు తీసుకుని వెంట తీసుకుపోయింది. తన నడగకుండా తనమీద ఆమె తీసుకునే స్వాతంత్ర్యం తనలో అరణ్యాన్ని నరికి దారి వేస్తున్నప్పటికి – తన భయం ఆదారి ఎక్కడికి తీసుకుపోతుందోనని. తను తెరవంక చూస్తుంటే ఆమె తనవంకే చూస్తున్నట్లు తన చెంపల్ని తాకిన ఆమె నిటూర్పులు చెప్పినయ్.

ఉషారాణి తన్ను ప్రేమిస్తోంది.

మరి సుందర్ తనతో ఎందుకలా అన్నాడు? ఆఫీసులో అంతా అలా అనుకుంటారేం! అదే నిజమైతే తనింక ఆమె నెలా కోరగలడు! ఆమె తనది కాదు – ఆమె తన దెన్నటికీ కాదు – తనే ఎందమావుల్ని నమ్ముకుంటున్నాడు.

చప్పుడు చేసుకుంటూ పక్కనుండి లారీ దూసుకుపోయింది. కాస్తలో ప్రమాదం తప్పింది. ప్రమాదా లెప్పుడూ యింతే, కాస్తలో తప్పిపోయి మొత్తం జీవితం విలువని గుర్తుచేస్తాయి.

సుబ్రహ్మణ్యం త్వరగానే వొచ్చేశాడు.

వస్తూనే 'నేను రేపు సాయంత్రం బండికి వెళ్ళిపోవాలి' అన్నాడు. మద్రాసునుండి వైరొచ్చిందట.

భోజనంచేసి మేడమీద పక్కవేసుకుని పడుకున్నాం.

'ఏమిట్రా ఏదో మాట్లాడాలన్నావ్?' అన్నాడు.

'అవును, యిందులో నీ సలహా, సహాయంకూడా కావాలి. నిన్న మా ఆఫీసుకొచ్చినప్పుడు ఉషారాణిని చూశావుగదూ –?'

'ఉఁ – అయితే –!'

'ఆమెని నేను ప్రేమిస్తున్నాను – నీ మాటల్లొ చెప్పాలంటే ఆమె నాకు కావాలి –'

'అయితే ఆవిడ్నే అడిగేసి మాకు భోజనాలు పెట్టేయ్' అన్నాడు యిదో సమస్యా అన్నట్లు.

'వినవోయ్ – ఆవిడ సెక్షన్‌లోనే సుందర్ అని ఒకతను వున్నాడు. అత నామెని గాఢంగా ప్రేమిస్తున్నాడు. నా అనుమానం ఆమెకూడా అతన్ని ప్రేమిస్తోందని.'

'నీకెట్లా తెలుసా సంగతి?'

'సుందర్‌కి నాకూ స్నేహం. అతనే మాటల్లో నాకీ విషయం చెప్పాడు. అతనికి నే ద్రోహం చేయలేను' అన్నాను.

కాస్సేపు వాడేమీ మాట్లాడలేదు.

'ఓ పదిరోజుల్లో నేను సెలవుపెట్టి నీతో గడపడానికి వొస్తాను - మరేం లేదు ఆవిడ్ని మళ్ళీ పుట్టింటికి పంపించాల్సొచ్చిందిలే - అప్పుడు నీ సమస్యని దగ్గరుండి నేనే పరిష్కరిస్తా. వీలైతే యీలోపల నువ్వే ఆమెని ఆడిగెయ్యి - యిటువంటి విషయాల్లొ నాన్చకూడదు,' అని ముసుగు పైకి లాక్కున్నాడు.

కాస్సేపటికి పక్కన సుబ్రహ్మణ్యం గుర్రు వినబడింది.

నాకుమాత్రం నిద్రపట్టడంలేదు.

"అవును, ఏ స్త్రీ సుందర్‌ని ప్రేమించదు? అతను అందమైన వాడు, జీవితాన్ని సౌందర్యవంతం, సుఖమయం చేయగలవాడు, నవీనుడు. అంతకంటే యింకేం కావాలి! మరి ఉషారాణి తనపట్ల ఎందుకా విధంగా ప్రవర్తిస్తోంది? ఏమో - ఆడవాళ్ళ హృదయాలు ఓపట్టాన తెలీవు. ఆమె నాతో ఆడుకుంటుందేమో"

చాలారాత్రి గడిచిపోయింది. నా ఆలోచనల్తొ నాకింకా నిద్రపట్టడంలేదు. దాహం వేస్తోంది. లేచాను. చప్పుడికి సుబ్రహ్మణ్యం కళ్లు తెరిచాడు.

'ఇంకా నిద్రపోలేదూ!' అని కోప్పడ్డాడు.

'దాహం వేస్తోందిరా'

"ఫ్రాయిడ్‌ని అడుగుదాంలే, పొద్దున్న. నిద్రపో" అన్నాడు సీరియస్‌గా.

పొద్దున్నే కాఫీ తాగి వెళ్ళిపోయాడు సుబ్రహ్మణ్యం - సాయంత్రం కనబడతానో, లేదో అంటూ. సాయంత్రం మా ఆఫీసుకి ఫోన్‌చేసి ఓ పది రోజుల్లో తప్పకుండా వస్తున్నట్లు చెప్పాడు.

చెప్పినట్లుగా సుబ్రహ్మణ్యం రావడం కాస్త ఆలస్యమైంది. ఈలోపల నేను ఊహించని సంఘటనలు జరిగాయి. ఉషారాణి ప్రవర్తనలో ఏమీ మార్పులేదు. నేనే రెండు మూడుసార్లు ఆమె నడిగేద్దామని వెళ్ళాను – కాని నేను పిరికివాణ్ణని స్థిరపరచుకుని, కాఫీతాగి వొచ్చేసేవాడిని. ఓ రోజు ప్రత్యేకంగా నా సీటు దగ్గరకొచ్చి తన పుట్టినరోజు పండగ సందర్భంగా సాయంత్రం జరిగే పార్టీకి రమ్మని ఆహ్వానించింది ఉషారాణి.

వెళ్ళాను.

ఉషారాణి ఎదురుచూస్తోంది గుమ్మంవద్ద, ఎప్పటి చిరునవ్వుతో, నన్ను కాల్చేసే చిరునవ్వుతో. అతిథులందరికీ బంధువుల్ని అప్పజెప్పేసి, దొడ్లో గులాబిమొక్కలపక్క కుర్చీలో నాతో ఎక్కువసేపు వుండిపోయింది.

ఆమె నిట్టూర్చి, నావంకచూసి పక్కకు తిరిగినప్పుడు మెళ్ళో నెక్లెస్ మెరిసేది. ఆ కాస్సేపట్లో ఎన్నో విషయాలు మాట్లాడింది ఉషారాణి – తనేం మాట్లాడలేకపోయినాడు.

చివరిగా – "నేను రేపు బందరు వెడుతున్నాను" అంది ఉషారాణి నిరాశగా నా రియాక్షనుని కళ్ళలో ఎదురుచూస్తొ.

"ఎన్నాళ్లు సెలవు పెట్టారు?" తను – వెధవ ప్రశ్న అనుకుంటూనే.

"ఇంక రాకపోవచ్చు – అదేగా మీకు కావలసింది".

"ఛ అదేమిటి, అలా అంటారు – బందరులో సముద్రం ఎంతో బాగుంటుంది, ఎప్పుడైనా వొస్తాను అడ్రసు యివ్వండి" అన్నాను. అయినా అంతకంటే తనేం మాట్లాడగలడు? ఆమెతో మాట్లాడుతుంటే సుందర్ గుర్తుకొచ్చాడు. ఉషారాణి తిరిగి నవ్వింది. ఆ నవ్వులో ఇదివరకటి ఉత్సాహం లేదు, బుగ్గలు ఎందుకో ఎరుపెక్కాయి. ఇంట్లోకి వెళ్ళిపోయింది.

మర్నాడు ఆమె బందరు వెళ్ళినట్లు తెలిసింది. సుందర్ ఆరోగ్యం బాగా లేదట, నాలుగురోజులు ఆఫీసుకి రాలేదు.

సుబ్రహ్మణ్యం బండి దిగి వస్తూనే మొహంలోకి చూస్తూ "ఎంతవరకూ వొచ్చింది కథ?" అన్నాడు.

చెప్పాను.

"ఆమె లేదంటున్నావుగదా, సుందరుని నాకు పరిచయం చెయ్యి. నేనే అతన్ని మాటలోకి దింపి అడుగుతాను – అంటూ మరీ యింత పిరికి వాడివైతే ఎలా బ్రతుకుతావురా" అని ఓ రిమార్కు పారేశాడు.

సాయంత్రం సుందర్‌ని మాతోబాటు కలుపుకుని టాంక్‌బండ్ మీదకు వెడదామని మా ప్రోగ్రాం. ఓ నిద్రతీసి, నెమ్మదిగా టాయ్‌లెట్ అయి, కాఫీ చప్పరించి, సిగరెట్టు ముట్టించి సుందర్ యింటికి బయలుదేరాం.

"కె. యస్. సుందర్" - బయట నల్లబోర్డుమీద తెల్ల అక్షరాలు. క్రింద లత పాడుతోంది. బెల్ విని, నాయర్ వొచ్చి తలుపు తెరిచాడు. అయ్యగారు స్నానం చేస్తున్నారు, కూర్చోండి, చెబుతాను" అని లోపలికెళ్లాడు.



"ఏమిట్రా పాఠాలు మానేసి సినిమా పాటల పుస్తకాలన్నీ తిరగేస్తూ చేస్తున్న పని....?"
"సినీమాకి కథ రాస్తున్నా నాన్నా! ఒక్కొక్క దాంటోంచి నాలుగేసి పంక్తులు తీసి రాస్తే అన్నీ కలిపి కొత్త కథ తయారైపోతోంది.
ఈ సంగతి మా క్లాస్‌మేట్ విఠల్ చెప్పాడు. వాడి నాన్న పెద్దపెద్ద సినిమాలకి కథలు యిట్టాగే రాసేస్తుండాట్ట...."

---

టీపాయ్‌మీదవున్న మాగజైన్ తిరగేస్తూ సోఫాలో చతికిలబడ్డాడు సుబ్రహ్మణ్యం.

నేను - కర్టెన్‌లోంచి కనబడుతున్న పక్కరూంలోని పుస్తకాల రాక్ దగ్గరకి చేరుకున్నాను. పుస్తకాలే ప్రపంచాన్ని పరిపాలిస్తాయి అనిపించింది నాకు — అన్ని పుస్తకాలు. షా, చలం, సార్త్రే, ఇలియెట్, నండూరి, కృష్ణశాస్త్రి, మపాసా, గోపీచంద్, లారెన్సు...పుస్తకాన్ని తీశాను.... లేడీ చాటర్లీస్ లవర్ -

"ఓరి శ్యామూ నువ్వట్రా - సుందర్, సుందర్ అంటే ఎవరో అనుకున్నాను -"

"ఓరి - మణ్యం - ఎప్పుడు రావటం?" ఇద్దరూ ఒకేసారి కౌగలించుకున్నారు.

నా బుర్ర తిరిగిపోతోంది.

కర్టెన్ తొలగించుకుని బయటికొచ్చాను. వాళ్ళిద్దరూ యింకా అలానే వున్నారు.

"ఏమోయ్ రావ్, మణ్యంగాడు నీకు తెలుసునని నాకింతవరకూ చెప్పలేదేమోయ్'' అన్నాడు మిస్టర్ కె. శ్యామసుందర్, నేనేం చెప్పాలో తెలీడం లేదు. బలవంతంగా చిరునవ్వయినా రావడంలేదు. ముళ్ళమీద నడుస్తున్నట్లుగా వుంది నా పరిస్థితి. ఓ అరగంటసేపు అక్కడ కూర్చోక తప్పలేదు. మళ్ళీ వొస్తాను అంటూ సుబ్రహ్మణ్యం నాతో వొచ్చేశాడు.

"ఈ పూట మీ యిద్దరూ భోజనానికి యిక్కడికే వొచ్చేయాలి" అంటున్నాడు శ్యామసుందర్ మా వెనక.

మే మిద్దరం రోడ్డుమీద ఏం మాట్లాడుకోలేదు. కనీసం సుబ్రహ్మణ్యాన్ని చూడడానికే నాకు భయంవేసింది.

రాత్రి ఎనిమిది గంటల బండికి ప్రయత్నించాను బందరు వెడదామనే. ప్లాటుఫారం మీదకు చేరుకునే లోపలనే బండి వెళ్ళిపోయింది.

"పొద్దున్నే డైరెక్టు బస్ వుంది, దానికెళ్ళు'' అన్నాడు సుబ్రహ్మణ్యం. ఆ రాత్రి నాకు నిద్రలేదని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

పొద్దున్న బస్ డిపోకి నాతోబాటు వొచ్చాడు సుబ్రహ్మణ్యం.

"కొన్ని అనుభవాలకి ముళ్లు వుంటాయి జాగ్రత్తరా — ఉషారాణితో తిరిగి నువ్వొచ్చేవరకూ నేను నీ గదిలోనే వుంటా" అన్నాడు సుబ్రహ్మణ్యం తన సహజధోరణిలో.

బస్సు వేగం నాకు చాలడం లేదు. ఉషారాణి ఏం చేస్తూంటుందో యిప్పుడు? నేను సుందర్‌ని అసహ్యించుకోలేదు. ఆఫీసులో వాళ్ళిద్దర్ని గూర్చి అలా అనుకున్నాడు. సుందర్ వాటిని తోసెయ్యలేదు. ఏ మగాడైనా ఆ పరిస్థితిలో అలాగే ప్రవర్తిస్తాడనిపించింది. అసలు మగవాడే అంతేనేమో. "కొన్ని అనుభవాలకి ముళ్ళుంటాయి జాగ్రత్త'' అన్నాడు సుబ్రహ్మణ్యం — ఎంత నిజం!

* * *

గదికొచ్చి స్నానంచేసి, భోంచేసి పడుకున్నాడు సుబ్రహ్మణ్యం. అతను నిద్రలో వుండగా కిటికీలోంచి అతనిమీద ఏదో పడితే మెలకువ వొచ్చింది, కవరు. పోస్ట్‌మన్ కిటికీలోంచి పడేశాడు. పసుపు చేతితో అంటించిన కవరు. సుబ్రహ్మం చింపాడు — ఉషారాణి పెళ్ళి. ★

---

## సినిమాక్విజ్ - జవాబులు

1. జగదేక వీరుడు
2. బండరాముడు
3. దాని
4. దొంగరాముడు
5. సంతానం
6. వేంకటేశ్వర మహాత్మ్యం